రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





మహాధర్నాకు సంఘీభావం తెలుపుతున్న ఎంప్లాయిస్ జెఏసి చైర్మన్ బి.రవిప్రకాశ్ తదితరులు

# 27న మహాధర్నా

### ఉద్యోగులంతా కలెక్టరేట్ వద్ద కదంతొక్కాలి
### న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం ఐక్య పోరాటం
### తెలంగాణ ఎంప్లాయిస్ జెఏసి పిలుపు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ఈ నెల 27వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద తెలంగాణ ఎంప్లాయిస్ జెఏసి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగుల మహాధర్నా జరుగుతుందని, ఉద్యోగులంతా భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా టిజిఈజెఏసి చైర్మన్ బి.రవిప్రకాశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కలిసి మహాధర్నాకు అనుమతి కోసం ఉద్యోగ సంఘాల నాయకులు టిజిఈజెఏసి ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ తరువాత శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ కె.నర్సింహ్మారెడ్డికి కూడా వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా టిజిఈజెఏసి చైర్మన్ బి.రవిప్రకాశ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఉద్యోగులు, గెజిటెడ్, అధికారులు, నాన్‌గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ గెజిటెడ్ ఆఫీసర్స్, నాన్‌గెజిటెడ్ ఆఫీసర్లు, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఈజెఏసి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. దశలవారీగ ఉద్యమ కార్యచరణను ఖరారు చేశారు. ఈ సందర్భంగా రవిప్రకాశ్ మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో 20వ పిఆర్‌సి నివేదికను ఈ నెల 30వ తేదీలోగా సాధించి అమలు చేయటం, పెండింగ్‌లో ఉన్న ఆరు డిఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ పథకాన్ని సమర్దవంతంగా పూర్తి స్థాయిలో అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు అన్నింటిని క్లియర్ చేసేందుకు ప్రతి నెల రూ.2వేలకోట్ల నిధులను విడుదల చేయటం, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్)ను పునరుద్దరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండ కాలయాపన చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే మాత్రం సెప్టెంబరు 10న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టే దిశగా కార్యచరణ సిద్దం చేస్తున్నట్లు తెలిపారు.

## ఎల్లమ్మ తల్లికి లక్ష పుష్పార్చన



శ్రావణమాసం రెండో మంగళవారం సందర్భంగా బల్కంపేట శ్రీ ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారి మూలవిరాట్‌కు లక్ష పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

# ముందు భూసేకరణ.. వెంటనే శంకుస్థాపన





- లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై సిఎం కీలక నిర్ణయం
- భూముల సమీకరణకు శరవేగంగా కదలాలని ఆదేశం
- అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరిక
- సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**షాద్‌నగర్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలకమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులను అత్యంత శరవేగంగా చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో ఆయన తాజా రాజకీయాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్‌తో సీఎం రేవంత్ రెడ్డి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఏర్పాటుపై ప్రత్యేకంగా చర్చించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో చివరి లింక్ అయిన లక్ష్మీదేవిపల్లి నిర్మాణానికి మొదట భూసేకరణ ప్రక్రియను పూర్తి చేస్తేనే, ఆ వెనువెంటనే రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేయడానికి మార్గం సుగమమవుతుందని స్పష్టం చేశారు. అందుకే స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమన్వయంతో ముందస్తుగా భూసేకరణను ప్రతిష్టాత్మకంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆయా నియోజకవర్గాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ (పునరావాసం), అటవీ శాఖ అనుమతుల (ఫారెస్ట్ క్లియరెన్స్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. భూసేకరణ విషయంలో నిరక్ష్యం వహిస్తే ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోతుందని, ఎమ్మెల్యేలు స్వయంగా శ్రద్ధ వహించి నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ పనులకు అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమీక్ష అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం వద్ద నిధుల కొరత ఏమీ లేదని, ఇప్పటికే అవసరమైన నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. భూసేకరణ పూర్తికాగానే ప్రాజెక్టు శంకుస్థాపన పనులు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలతో పాటు పలువురు విప్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్ఆర్

# తేల్చాల్సింది బిఎల్ఏలే

- ★మహేశ్వరంలో మొత్తం 5.74 లక్షల ఓట్లు ఉండాలి
- ★డ్రాఫ్ట్ రోల్‌లో 3.39 లక్షల మంది మాత్రమే నమోదు
- ★తొలగించిన 2.35 లక్షల పేర్లలో నిజమైన ఓటర్లెవరో చెప్పండి
- ★ప్రజల సందేహాల నివృత్తికి త్వరలోనే ప్రత్యేక కాల్ సెంటర్

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో భారీగా దొంగ ఓట్లు నమోదు చేయడం వల్లే సబితారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి, పార్టీకి వెన్నుపోటు పొడిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లి పదవులు అనుభవించారని విమర్శించారు. మహేశ్వరంతో పాటు శివారు ప్రాంతాల్లో కాంగ్రెస్ నష్టపోవడానికి దొంగ ఓట్లే ప్రధాన కారణమని పేర్కొన్నారు. వై.ఎ.ఆర్. కన్వెన్షన్‌లో నిర్వహించిన సర్ ఫేజ్2 బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 75 వేల నుంచి 80 వేల వరకు దొంగ ఓట్లు నమోదు చేయించారని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో మొత్తం 5,74,637 మంది ఓటర్లు ఉండగా, డ్రాఫ్ట్ రోల్‌లో 3,39,306 మంది పేర్లు మాత్రమే ఉన్నాయని, ఏకంగా 2,35,331 మంది ఓటర్ల పేర్లు రద్దు అయ్యాయని వెల్లడించారు. తొలగించిన పేర్లలో నిజమైన ఓటర్లు, దొంగ ఓట్లు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను బిఎల్ఎలు బూత్ స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హత ఉన్న నిజమైన ఓటరు పేరు తొలగిపోతే తిరిగి నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు. ప్రజల అనుమానాలు నివృత్తి చేసేందుకు త్వరలోనే ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసి నంబర్ వెల్లడిస్తామన్నారు. ఈ సందర్భంగా అర్హులైన కొత్త ఓటర్ల నమోదుకు ఫారం 6, మరణించిన వారి లేదా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పేర్ల తొలగింపునకు ఫారం 7, ఓటరు వివరాల సవరణకు ఫారం 8 వినియోగించాలని బిఎల్ఎలకు వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు పరిశీలించాలని, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కాల్వ సుజాత, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ జగదీశ్, రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా ఉండేలా చూడటమే కాంగ్రెస్ శ్రేణుల బాధ్యత అని నాయకులు పిలుపునిచ్చారు.

## అంజయ్యనగర్‌లో కూల్చివేతల జోరు..

**గచ్చిబౌలి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో హైడ్రా ఆధ్వర్యంలో చేపడుతున్న కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కుప్పకూలిన ఏడంతస్థుల భవనం పక్కనే ప్రమాదకరంగా మారిన భవనాల కూల్చివేతలు చేపట్టిన హైడ్రా మంగళవారం మరో భవనం కూల్చివేతను ప్రారంభించింది. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నాలాను ఆక్రమించి కేవలం 50 గజాల స్థలంలో నిర్మించిన ఏడంతస్థుల భవనం శనివారం మధ్యాహ్నం కుప్పకూలిన విషయం తెలిసిందే. కాగా ఈ ప్రమాదంలో ఇద్దరు టైల్స్ కార్మికులు మృతిచెందగా, భవనం శిథిలాలు పక్క భవనం మీద పడి అందులో నివాసం ఉంటున్న మాజీ ఆర్మీ ఉద్యోగి రమణారెడ్డి గాయపడ్డాడు. భవనం కూలిన అనంతరం అప్రమత్తమైన సీఎం సి, హైడ్రా యంత్రాంగం యాక్షన్ ప్లాన్‌కు సిద్ధమైంది. ఇందులో భాగంగా కూలిన శిథిలాలను తొలగించడంతో పాటు కూలిన భవనం కారణంగా దెబ్బతిన్న చుట్టు ప్రక్కల ఉన్న భవనాల తొలగింపును శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కూలిన భవనానికి ఆనుకొని ఉన్న మరో ఆరంతస్థుల భవనం కూల్చివేయగా, సోమవారం మరో భవనాన్ని కూల్చివేశారు. మంగళవారం పక్కనే ఉన్న మరో భవనం కూల్చివేత పనులను హైడ్రా అధికారులు చేపట్టారు. అంజయ్యనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న 8 భవనాలను గుర్తించినట్లు పేర్కొన్న హైడ్రా అధికారులు అందుకు అనుగుణంగా కూల్చివేతలు కొనసాగిస్తున్నారు.

### లక్ష్యాలను సాధించడమే కాదు...
# పేదలకు చేయూత నివ్వండి!

### రుణ మంజూరులో అదనపు చార్జీలు వద్దు: బ్యాంకర్లకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ విజ్ఞప్తి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25, ప్రభాతవార్త :** బ్యాంకులు నిర్దేశిత లక్ష్యాలను సాధించటమే కాకుండా ఆర్థికంగా వెనకబడిన వారికి బ్యాంకులు చేయూత నివ్వాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశానికి వచ్చె ముందు బ్యాంకర్లు పూర్తి సమాచారంతో రావాలని ఆయన ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిసిసి,డిఎల్ఆర్‌సి సమావేశం జరిగింది. దీనిలో ఆయనతో పాటు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బ్యాంకుల ఉన్నతాధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆర్థికంగా చేయూత నివ్వాలని, వారి అభ్యున్నతికి బ్యాంకులు సహకరించాలని సూచించారు. ప్రభుత్వం, బ్యాంకర్స్ సమన్వయంతో పనిచేయాలని లక్ష్యాన్ని సాధించాలని ఆయన అన్నారు. ప్రజల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని ఫైజాన్ అహ్మద్ అన్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పేద, బలహీనవర్గాలకు బ్యాంకులు చేయూతనివ్వాలన్నారు. స్వయం సహాయక గ్రూపుల వారికి అందించే రుణాలు సకాలంలో మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని బ్యాంకర్లకు సూచించారు. ఎలాంటి అదనపు చార్జీలు విధించకుండా చూడాలన్నారు. బ్యాంకుల వద్ద ఎదురయ్యే ఇబ్బందులను తొలగించి లబ్ధిదారులకు సౌకర్యవంతమైన విధానం అమలు చేయాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఇతర బలహీన వర్గాలకు వివిధ రుణ పథకాలపై అవగాహన కల్పించాలని, సమాచారం ఇచ్చి శిబిరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి బ్యాంకర్లకు సూచించారు.





సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ముఖ్యంగా ముద్ర, పిఎం.విశ్వకర్మ, పిఎంఇజిపి, పిఎం ఎఫ్ఎంఇ, ఎంఎస్ఎంఇ, ఆర్ఎఎంపి వంటి పథకాల ద్వారా యువత, మహిళలు స్వయం ఉపాధిదారులకు రుణాలు అందేలా చూడాలని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని, రుణాలపై ఉన్న సందేహాలను లబ్ధిదారులతో నేరుగా సంప్రదించి నివృత్తి చేయాలని బ్యాంకు అధికారులను ఆయన కోరారు. బ్యాంకింగ్ సేవల విషయంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత బ్యాంకుల సంబంధిత అధికారులను ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి నిలదీశారు. సంబంధిత అధికారులు త్వరలో పూర్తి వివరాలతో అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్, వివిధ బ్యాంకుల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దండు శ్రీనివాస్‌గౌడ్

## కేంద్ర ప్రభుత్వ పథకాలకు సొంత రంగు వేసుకోవద్దు

### బిజెపి ఇచ్చే సంక్షేమాన్ని ప్రజలకు బహిర్గతం చేయాలి
### పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు శ్రీనివాస్ గౌడ్

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న అనేక సంక్షేమ,అభివృద్ధి పథకాల ద్వారా తెలంగాణ ప్రజలు లబ్ధి పొందుతున్నప్పటికీ, వాటిలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యాన్ని ప్రజలకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కేంద్రం నుంచి నిధులు రావడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, కార్మికులు, గ్రామీణ ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద రేషన్ బియ్యం పొందుతున్న ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఐదు కిలోల చొప్పున ఉచిత బియ్యం అందుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే రేషన్ దుకాణాల వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి, సివిల్ సప్లై శాఖ మంత్రి ఫొటోలను ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తన పథకాలుగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ప్రజలకు ఏ పథకం ద్వారా ఎంత నిధులు వస్తున్నాయి,అందులో కేంద్రం వాటా ఎంత,రాష్ట్రం వాటా ఎంత అనే వివరాలను స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

# పండుగల వేళ...హై అలర్ట్

### అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు నివారణ చర్యలు: ఎస్పీ ఆదేశం

**వికారాబాద్, ప్రభాతవార్త:** పండుగల ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా అన్నారు. మిలాద్-ఉన్ నబీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించిన పోలీస్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పండుగలు, ఊరేగింపులు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, అన్ని వర్గాల ప్రజలతో సమన్వయం చేసుకుంటూ శాంతి, సామరస్యాన్ని కాపాడాలని ఆదేశించారు. సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. మిలాద్‌ఉన్‌నబీ పండుగ, ఊరేగింపుల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. వికారాబాద్, పరిగి, తాండూర్, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, కొటేపల్లి, కుల్కచర్ల, దోమ, ధారూర్, కొడంగల్, కరణ్‌కోట్, చెంగోముల్,



మాట్లాడుతున్న ఎస్పీస్నేహా మెహ్రా

బొంరాస్‌పేట్, పెద్దేముల్, దుద్యాల్, బంట్వారం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ సమావేశాలు నిర్వహించినట్లు సంబంధిత అధికారులు ఎస్పీకి వివరించారు. పోలీసుల సూచనలు, నిబంధనలు, నియమావళి, నిర్దేశించిన సమయాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ సంయమనం, సోదరభావంతో వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని, సోషల్ మీడియాలో పుకార్లు, అభ్యంతరకరమైన, రెచ్చగొట్టే సమాచారాన్ని ప్రచారం చేయవద్దని పోలీసులు ప్రజలకు స్పష్టం తెలియజేయాలని ఎస్పీ తెలిపారు.



వికారాబాద్ ఎల్లమ్మతోట ఆవరణలో మొక్కలు నాటుతున్న కలెక్టర్, ఇతర అధికారులు

# ప్రతి మొక్కకూ ట్రీగార్డ్

### హరితహారంలో విద్యాసంస్థల భాగస్వామ్యం: కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, ప్రభాతవార్త :** హరితహారం కార్యక్రమం విజయవంతానికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ తోట ఆవరణలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, ఐఎఫ్ఎస్ అధికారి రత్నాకర్ జహోర, డీఎఫ్ఓ విశాల్ బట్టుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటడంతో పాటు, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం, మొక్కల పెరుగుదలను పర్యవేక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. హరితహారం కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖకు కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు.

# నీట్-పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్మయి, వీడియో కన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** ఈ నెల 30న నిర్వహించనున్న నీట్-పీజీ 2026 పరీక్షను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థుల తనిఖీలు, విద్యుత్, అంతర్జాల సౌకర్యాలు, సైబర్ భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నీట్-పీజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఏసీపీలు,ఇతర సంబంధిత అధికారులతో మంగళవారం వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ వైద్య విజ్ఞాన పరీక్షల మండలి ఆధ్వర్యంలో ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒకే విడతలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియ ఉదయం 7 గంటల నుంచే ప్రారంభమవుతుందని,పరీక్ష సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రతి పరీక్షాకేంద్రానికి ఒక తహసీల్దార్‌ను నోడల్అధికారిగా, ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను తనిఖీబృందఅధికారిగా, నాయబ్ తహసీల్దార్‌ను పర్యవేక్షణ అధికారిగా నియమించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కేంద్రానికి తగినంత పోలీసు సిబ్బందిని కేటాయించి, వారికి విధులను ముందుగానే స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.పరీక్ష ప్రారంభానికి ముందే కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి,అధికారుల నియామకం, విధుల కేటాయింపులో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు పరీక్షా కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, మహిళా అభ్యర్థుల తనిఖీల కోసం ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.చేతితో ఉపయోగించే లోహ గుర్తింపు పరికరాలతో తనిఖీలు నిర్వహించాలని, అభ్యర్థుల అసలు గుర్తింపు పత్రాలు,ఆధార్,జీవగుర్తింపు ధ్రువీకరణ తదితర అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు.మొబైల్ ఫోన్లు,రహస్య కెమెరాలు, చెవిలో పెట్టుకునే సమాచార పరికరాలు,ఇతర సమాచార సాధనాలు, చీటీలు,నోట్స్ వంటి నిషేధిత వస్తువులు పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలాచర్యలు తీసుకోవడంతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ విద్యుత్ సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు.ప్రశ్నపత్రాల భద్రత,పరీక్ష నిర్వహణ,అభ్యర్థుల సమాధానాల సమాచారాన్ని భద్రపరచడం వంటి ప్రక్రియలకు అవసరమైన అంతర్జాల సౌకర్యం నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.పరీక్షాకేంద్రాలకు సమీపంలోని సైబర్ పోలీసు విభాగాలతో సమన్వయం చేసుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.పరీక్షకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారం,ప్రశ్నపత్రం లీక్,ఇతరుల పేరుతో పరీక్ష రాయడం,పుకార్లు వంటి అంశాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.ఏదైనా అనుమానస్పద సమాచారం లేదా అవాంఛనీయ పరిణామానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల ప్రవేశ,నిష్క్రమణ ప్రాంతాల్లో తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి అభ్యర్థులు,వారితో వచ్చే వ్యక్తులరద్దీని నియంత్రించాలని కలెక్టర్ ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,అధిక రద్దీ ఉండే కేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## శివాలయంభూమిని సర్వే చేయించి కాపాడాలని వినతి

-సీఎం ప్రజావాణిలో చిన్నారెడ్డికి ధర్మకర్త విజ్ఞప్తి

**ఘట్‌కేసర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి ఆలయ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడేందుకు సర్వే చేసి విచారణ జరపాలని ఆలయ ధర్మకర్త కంట్లం గౌరీశంకర్ కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డిని కలిసి ఆలయ భూమిని సర్వే చేయించాలని వినతిపత్రం అందజేశారు. ఎదులాబాద్‌లో భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి ఆలయం పక్కన సర్వేనంబర్ 971లో 2-31 ఎకరాల పట్టాభూమి ఉందని తెలిపారు. ఆలయానికి తూర్పు వైపున పట్టాదారు పక్కన ఉన్నే 300 గజాల దేవాలయ స్థలాన్ని ఆక్రమించి ప్రహారిగోడ నిర్మాణం చేశారని తెలిపారు. గోడ నిర్మాణం కారణంగా ఆలయానికి ఉత్తర ప్రవేశద్వారం లేకుండా పోయిందని వైకుంత ఏకాదశికి భక్తులు ఉత్తర ద్వారం మీదుగా రాలేని పరిస్థితి ఏర్పడిందని, ఉత్తర ద్వారం ముందు ఉన్న కొనేరు నుంచి నీరు తీసుకువచ్చి మల్లిఖార్జునస్వామి పూజలకు వినియోగిస్తామని నీరు తేకుండా గోడ పెట్టారని పేర్కొన్నారు. ఆలయ భూమి కబ్జా చేస్తున్నారని గతంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు, పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సర్వే చేసి ఆలయ భూమిని కాపాడి ఉత్తర ప్రవేశద్వారం తిరిగి పునరుద్దరించేలా తగిన చర్యలు తీసుకోవాలని ధర్మకర్త గౌరీశంకర్ విజ్ఞప్తి చేశారు.

# చౌడపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

చౌడపూర్ ఆగస్టు 25 ప్రభాతవార్త

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రత్యేక శ్రద్ద చేపట్టాలని ,చౌడపూర్ మండలంలో ప్రజలకు అందుతున్న సేవలపై మండలస్థాయి సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సమీక్ష చేశారు..మంగళవారం, మండల కేంద్రం రైతు వేదికలో మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసారు.మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు అవసరమైన సేవలను అధికారులు అందించాలని తెలిపారు.అనంతరం అధికారులు,ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులతో కలిసి అర్హులైన లబిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ నెల 27న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహిస్తారని, గ్రామ సభల్లో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌ను ప్రజలకు చదివి వినిపించి, ఓటర్ల వివరాలను పరిశీలించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్నవారు సంబంధిత పత్రాలతో బిఎల్ఓ లేదా పంచాయితీ సెక్రటరీలను కలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సోమలింగం , తహషీల్దార్ వెంకటేశ్వర్లు, డిఈఈ ఉమేష్ కుమార్, ఎంఈఓ రాంచందర్, ఏఓ పరిమళ, ఎస్ ఐ రమేష్,ఎంపీఓ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్,పలుశాఖల అధికారులు ,సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై విచారణకు ఏర్పాట్లు

**మాడ్గుల,ఆగస్టు25,ప్రభాతవార్త:**మాడ్గుల మండలంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీలలో బూత్ స్థాయి అధికారులు ప్రచురించారు.పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సంబంధించిన నోటీసులను బూత్ స్థాయి అధికారులకు అందజేసే ప్రక్రియ ప్రారంభమైంది.ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు,ఇతర వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు,దావాలు ఉన్న ఓటర్లకు నోటీసులు అందజేసి,నిర్ణీత తేదీల్లో గ్రామాల వారీగా విచారణ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రజల నుంచి అందే దావాలు,అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు.మండలంలోని గ్రామాల వారీగా విచారణ తేదీలను అధికారులు ప్రకటించారు. కుల్కులపల్లిలో ఆగస్టు 27న,నాగిళ్లలో ఆగస్టు 28,29 తేదీల్లో, అప్పారెడ్డిపల్లిలో ఆగస్టు 31న,అవురుపల్లిలో సెప్టెంబర్ 1న,నర్సాయిపల్లిలో సెప్టెంబర్ 2న,మాడ్గులలో సెప్టెంబర్ 3న విచారణ నిర్వహించనున్నారు.అలాగే నల్లచెరువులో సెప్టెంబర్ 5న,చంద్రాయణపల్లిలో సెప్టెంబర్ 6న,కలకొండలో సెప్టెంబర్ 7న,ఇర్విన్‌లో సెప్టెంబర్ 8,9 తేదీల్లో కుబ్యా తండాలో సెప్టెంబర్ 15న,అందుగుల్‌లో సెప్టెంబర్ 16న,అర్కపల్లిలో సెప్టెంబర్ 17,18 తేదీల్లో విచారణ నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా,ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు బూత్ స్థాయి అధికారులు,సంబంధిత అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని మాడ్గుల్ తహసీల్దార్ వినయ్ సాగర్ తెలిపారు.ఓటర్లు తమకు సంబంధించిన నోటీసులను పరిశీలించుకోవడంతో పాటు,ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు,చిరునామా,ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని ఆయన సూచించారు.ఏవైనా దావాలు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత తేదీల్లో సంబంధిత విచారణకు హాజరై అవసరమైన పత్రాలు, ఆధారాలను సమర్పించాలని కోరారు.ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా,అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం సరిచేసేలా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వినయ్ సాగర్ పేర్కొన్నారు.ప్రజలు ఈ ప్రక్రియలో అధికారులకు సహకరించి,నిర్ణీత తేదీల్లో విచారణకు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మేడ్చల్ తహసీల్దార్ భూపాల్‌కు బిఎల్‌ఓల వినతి

**మేడ్చల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మేడ్చల్ ఏఈఆర్ఓ తహసీల్దార్ పరిధిలో బిఎల్ఓలుగా పని చేస్తున్న తమకు బకాయి పడ్డ 5సంవత్సరాల గౌరవ వేతనం అందజేయాలని కోరుతూ బిఎల్ఓలు మేడ్చల్ తహసీల్దార్ భూపాల్‌కు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ ఏఈఆర్ఓ తహసీల్దార్ పరిధిలోఉన్న 34 పోలింగ్ బూత్‌లకు 34మంది బిఎల్ఓలుగా తాము ఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వహిస్తున్నామని, అందుకు తమకు ఎలక్షన్ కమిషన్ నుండి సంవత్సరానికి సుమారుగా రూ. 18 వేల గౌరవ వేతనం రావాల్సి ఉందని బిఎల్ఓలు వినతి పత్రంలో పేర్కొన్నారు. కానీ గత 5 సంవత్సరాల నుండి తమకు రావాల్సిన గౌరవ వేతనం అందడం లేదని వెంటనే వాటిని ఇప్పించి తమను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీటీ అనూష, ఆర్ఐ చందన్‌రెడ్డి, బిఎల్ఓలు వెంకట్‌రెడ్డి, జ్యోతి, విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కాలె అనిత-రమేష్

**యాచారం,ఆగస్టు25, ప్రభాతవార్త :**

ఉప సర్పంచ్‌ల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా యాచారం మండలం కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ కాలె అనిత-రమేష్ మంగళవారం నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లావుడ్య రాములు నాయక్ కాలె అనిత-రమేష్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా కాలె అనిత-రమేష్ మాట్లాడుతూ ..తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లావుడ్య రాములు నాయక్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఉప సర్పంచ్‌ల సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడంతో పాటు, ఉప సర్పంచ్‌లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యంగా ముందుకు సాగేందుకు తన వంతు కృషి చేస్తానని కాలె అనిత-రమేష్ తెలిపారు.కాలె అనిత-రమేష్‌కు రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు దక్కడం పట్ల కొత్తపల్లి గ్రామ ప్రజలు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## బిఆర్ఎస్‌పార్టీలో చేరిన ధర్మారెడ్డి

**ఘట్‌కేసర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం డైరక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి మంగళవారం తిరిగి సొంతగూటికి చేరారు. మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి సమక్షంలో ఆయన బీఆర్ఎస్‌పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌పార్టీ నాయకుల వైఖరితో మనస్థాపం చెందిన ధర్మారెడ్డి గతంలో బీఆర్ఎస్‌పార్టీకి రాజీనామా చేసి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌కు చెందిన సొసైటీ డైరక్టర్ ధర్మారెడ్డి తిరిగి పార్టీలోకి రావాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరడంతో గులాబి గూటికి చేరారు. ఈసందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదేశాలకు అనుగుణంగా బీఆర్ఎస్‌పార్టీ పటిష్టత కోసం తాను శాయశక్తులా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎదులాబాద్ మాజీ ఎంపిటిసి సభ్యులు మంకం రవి, రైతుబంధు సమితి జిల్లా మాజీ సభ్యులు చిలుగూరి మంకయ్య, బొంత జైపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

## కొత్త ఓటర్ లిస్ట్‌లో తప్పులను సవరించుకోండి

**తలకొండపల్లి ఆగస్టు 25, ప్రభాతవార్త:**

పాలకొండపల్లి మండలంలో ఎస్ ఐ ఆర్ పూర్తయిన అనంతరం కొత్త ఓటర్ లిస్ట్ లో తమ పేర్లను సరి చూసుకోవాలని తల కొండపల్లి తాసిల్దార్ రమేష్ కుమార్ చెప్పారు. మంగళవారం నాడు మండలంలోని అన్ని గ్రామాల నూతన ఓటర్ లిస్టులను ఆయా గ్రామాల గ్రామ కార్యదర్శులు జీపిఓ, బి ఎల్ ఓ లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 37,745 ఓటర్స్ కు గాను ఎస్ ఐ ఆర్ మొత్తం పూర్తి చేశారని, అందులో 8434 మంది ఓటర్స్ చిన్నచిన్న వ్యత్యాసాలతో పేర్లలో తప్పులు జరిగాయని వాటిని, ఆయా గ్రామపంచాయతీలో జరిగే గ్రామసభలలో సరిచేసుకోవాలని ఆయన సూచించారు. మండలంలో మొత్తం 86 శాతం పైగా ఎస్ ఐ ఆర్ పూర్తయిందని, మండలంలో ఈనెల 27 నుంచి అక్టోబర్ 8 వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని ఆయన సూచించారు.

## అక్రమంగా తరలిస్తున్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** పోచారం గ్రామ పరిసరా ప్రాంతంలో ఓ్యక్తి అక్రమంగా సేకరించిన రేషన్ బియ్యం దాదాపు 8 క్వింటాళ్లు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు స్థానిక పోలీసుల కథనం ప్రకారం ఇన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు పోచారం గ్రామ పరిధిలో రేషన్ బియ్యాన్ని ఓ వ్యక్తి సేకరించి మహేంద్ర వ్యాన్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు.

పట్టుబడిన వ్యాన్ డ్రైవర్‌ను ప్రశ్నించగా గూగులోత్ రమేశ్ ( 31 ), యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు. రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ తిరిగి సేకరించి అధిక ధరకు విక్రయించడానికి ఇక్కడి నుండి తరలిస్తున్నట్లు నిందితుడు పోలీసులకు తెలిపారు.

పట్టుబడిన రేషన్ బియ్యం దాదాపు 8 క్వింటాళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని సదరు వ్యాన్ డ్రైవర్ అయిన రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయానికి విరాళం

రూ.51వేలు అందజేసిన దాత కందాడి అంజిరెడ్డి

**శామీర్‌పేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

లాల్‌గడిమలక్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధి కోసం దాత కందాడి అంజిరెడ్డి రూ.51వేలు విరాళంగా అందజేశారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని ఆయన సందర్శించి తండ్రి కందాడి పాపిరెడ్డి పేరు మీద కుమారుడు దాత కందాడి అంజిరెడ్డి ఆ దేవాలయం అభివృద్ధి కోసం రూ.51వేలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ (15వ వార్డు) కౌన్సిలర్ నేమూరి స్వప్నరాంప్రసాద్‌గౌడ్ కోరిన మేరకు దాత కందాడి అంజిరెడ్డి విచ్చేసి ఇటీవలనే నూతనంగా నిర్మించి నిత్య పూజలు అందుకుంటున్న శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం కోసం ఆయన విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాల్‌గడిమలక్‌పేట్‌లో ఇటీవల నిర్మించిన శ్రీరేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహించటం జరిగిందని, ఆలయ అభివృద్ధి కోసం భక్తులు, దాతలు ముందుకు రావాలని కోరారు. ఆలయ అభివృద్ధి కోసం కందాడి కుటుంబ సభ్యులు అందజేసిన విరాళంను సద్వినియోగం చేయటం జరుగుతుందన్నారు. విరాళం అందజేసిన కందాడి అంజిరెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ వారు ప్రత్యేకంగా దన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు కూడ ఆలయ అభివృద్ధి కోసం తమ వంతు సహకారాలు అందించాలని వారు కోరారు.

## గురుకుల్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలోని గురుకుల్ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు మేకల నర్సింగ్‌రావు, బచ్చు నగేశ్‌కుమార్‌గుప్తా, బిజిలి సదానందం, ఎండి.సిరాజ్‌లు మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల గురుకుల్ కళాశాలలో జరిగిన తరగతిగది, మరుగుదొడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్, మాజీ ప్రజాప్రతినిధులు, జీపీఎస్ సభ్యులు, విద్యార్థులు ఎమ్మెల్యేను కోరగా అవసరమైన ప్రతిపాదనలతో వినతిపత్రాలు ఇవ్వాలని సూచించిన మేరకు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వివరాలు తెలియజేశారు. గురుకుల్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో ఘట్‌కేసర్, కీసర, బీబీనగర్, శామీర్‌పేట్, మేడిపల్లి మండలాల నుంచి విద్యార్థులు చదువుతున్నారని, అధ్యాపకులు, భోధనేతర సిబ్బంది లేక విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అధ్యాపకులు, సిబ్బందిని నియమించాలని ఇంటర్‌మీడియెట్ విద్యా కమీషనర్‌కు, గురుకుల్ ఎయిడెడ్ కళాశాలలో సీఈసీ, ఎంఈసీ, ఎంపీసీ, బిపీసీ గ్రూపుల సెక్షన్ విద్యార్థుల సంఖ్యను 88 నుంచి 110 వరకు పెంచాలని, కామర్స్, బోటనీ, జువాలజీ, తెలుగు, ఎకానమిక్స్, మ్యాథ్స్, సివిక్స్ అధ్యాపకులను పిజికల్ డైరక్టర్, సిబ్బందిని రెడెప్లాయ్‌మెంట్ చేయాలని మేడ్చల్ జిల్లా ఇంటర్‌మీడియెట్ విద్యాధికారికి ఎమ్మెల్యే ద్వారా వినతిపత్రాలను చేశారు. సెప్టెంబర్ 7వ తేదీన గురుకుల్ సమస్యలు వివరించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ తీసుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈఅంశాలపై రూపొందించిన వినతిపత్రాలను ఘట్‌కేసర్ తపాలా కార్యాలయంలో స్పీడ్ పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, కామర్స్ శాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబులకు లేఖలను పంపించారు.

## అర్హులైన ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలి

..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ పేస్ 2లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు అయ్యేలా బిఎల్ఏలు భాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని శ్రీకన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌పార్టీ బూత్‌లెవల్ ఏజెంట్ల (బిఎల్ఏ)లకు ఎస్ఐఆర్ పెస్2లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎట్టి పరిస్థితులలో అర్హులైన ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. నియోజకవర్గంలో దాదాపు 50 వేల ఓటర్లకు నోటీసులు అందాయని, వారందరు తప్పకుండా వివరణ ఇచ్చే విధంగా బిఎల్ఏలు చూసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజాబాల్‌రెడ్డి, ఎస్ఐఆర్ కన్వీనర్ పురుషోత్తంరావు పార్లమెంటు ఇంచార్జ్ జగదీశ్వర్, వైస్‌చైర్మెన్ అబ్దుల్ రజాక్, ఏఎంసి చైర్మెన్ వడ్డె శ్రీనివాస్, ఎస్ఐఆర్ కోడంగల్ కీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని వివిధ బూత్‌ల బిఆర్ఏలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అంగడి బజార్ ప్రారంభోత్సవం

**షాద్‌నగర్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** వెల్జర్ల గ్రామ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగడి బజార్ (కూరగాయల మార్కెట్-సంత)ను ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు సర్పంచ్ ఆర్. బాబు నాయక్ తెలిపారు. రైతులు తమ పంటలను నేరుగా విక్రయించుకునేందుకు, గ్రామ ప్రజలు నాణ్యమైన కూరగాయలు, నిత్యావసర వస్తువులను సులభంగా కొనుగోలు చేసేందుకు అంగడి బజార్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంత అందుబాటులోకి రావడం వల్ల వెల్ జర్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు, వ్యాపారులు, ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

రైతులకు స్థానికంగానే మార్కెట్ సౌకర్యం లభించడంతో పాటు, ప్రజలకు అవసరమైన కూరగాయలు అందుబాటులో ఉంటాయని అన్నారు. గ్రామ అభివృద్ధిలో అంగడి బజార్ మరో ముందడుగు అని పేర్కొన్నారు. వెల్జర్ల గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, వ్యాపారులు, యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంగడి బజార్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ ఆర్. బాబు నాయక్ కోరారు. రైతుకు మార్కెట్ - ప్రజలకు సౌకర్యం.. మన సంత - మన గ్రామ అభివృద్ధికి బాట" అని సర్పంచ్ అన్నారు.


స్వామివారి ఆలయం

## 29 నుండి శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు

**కొడంగల్,అగష్టు 25,ప్రభాతవార్త:**కొడంగల్ పట్టణంలోని బ్రహ్మణవాడలో వెలసిన కలియుగ కామధేనువులయిన శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 29 నుండి 3రోజులపాటు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని గురురాఘవేంద్ర సేవా సమితి సభ్యులు జయతీర్థాచారీ తెలిపారు.స్వామివారి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈనెల 29న ఉదయం సుప్రభాతం,పూజా కార్యక్రమలు,పంచామృతాభిషేకము, అష్టోత్తర పారాయణము,తులసి అర్చన, మంగళహారతి ,ప్రవచనము, భజన,పల్లకి సేవా,అష్టావధానము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే 30న స్వామివారి రథోత్సము,31న రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.స్వామివారి ఆరాధనోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## కళాశాలలో ర్యాగింగ్ చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

**కొడంగల్,అగష్టు 25,ప్రభాతవార్త:**కొడంగల్ పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్‌ల సంయుక్త అద్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి అద్యక్షతన విద్యార్దులకు ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి కొడంగల్ ఎస్సై జీవీ. సత్యనారాయణ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక అసాంఘిక చర్య అని అది చట్టరీత్యా నేరమని విద్యార్దులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు.ఎవరైనా ఇతరులని భౌతికంగా, మానసికంగా,సామాజికంగా వేధించడం ర్యాగింగ్గఆ పరిగణించబడుతుందని,ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే లక్ష రూపాయల జరిమానా, రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. విద్యార్దులు స్వీయ క్రమశిక్షణతో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలన్నారు.ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల ర్యాగింగ్ రహితమని,విద్యార్దులు మానవత్వంతో మెలగాలని,కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రాంబాబు,అకాడమిక్ కోఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్, యం.హరిప్రియ, ఇ.సోమ్లా ,కె.రమేష్‌బాబు, వి.శ్రీధర్‌కుమార్ ,కె.అన్నపూర్ణ తదితర అధ్యాపకులు,విద్యార్దులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుండాల అనిల్ కుమార్


అనిల్ కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

**నందిగామ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** నందిగామ మండలం వెంకమ్మగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువనేత గుండాల అనిల్ కుమార్ షాద్నగర్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగేందర్ , ఇన్చార్జి సంతోష్ గౌడ్ చేతులమీదుగా అనిల్ కుమార్‌కు ధ్రువీకరణ పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో విశ్వాసంతో తనకు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించినందుకు కాంగ్రెస్ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గుండాల అనిల్ కుమార్ ను తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందెమోహన్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత బుయ్యని వీరేందర్ గౌడ్, నందిగామ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ చారి, గ్రామ యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుండాల రాజేష్, మాణిక్యం, శ్రీనివాస్ సిద్ధు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు అండగా ..ఉద్యోగ సాధనకు బాటగా బిఎంఆర్ పౌండేషన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను సాధించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం తాండూరు కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం లో బియంఆర్ పౌండేషన్ అధ్వర్యం లో ఎస్ఐ, కానిస్టెబుల్, గ్రూప్స్, రైల్వే తదితర పోటి పరిక్షలకు నిర్వహించనున్న ఉచిత శిక్షణ తరగతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ సాధనకు బాటగా బిఎంఆర్ పౌండేషన్ ఉందని, అందుకు యువత ఇలాంటి ఉచిత శిక్షణను సద్వినీయోగం చేసుకోవాలని కోరారు.

## రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**షాద్‌నగర్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నిరక్ష ్యల్ల చేస్తోందని విమర్శించారు.రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు ఆలస్యం కావడంతో తెలంగాణలోని అనేక ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.

# ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం తగదు

**వికారాబాద్, ప్రభాతవార్త:** సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ను కేంద్రం అనుమతి ఇవ్వక పోవడంపై తెలంగాణ కు అవమానమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం సరైంది కాదని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు టి.సదానంద్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీదేశాంగ శాఖ అనుమతి తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి లండన్ వెళ్లారని, అమెరికా పర్యటన సంబంధించిన అనుమతి తీసుకోవాలనే విషయం సీఎం రేవంత్ రెడ్డి కి తెలియదా అని ప్రశ్నించారు. లండన్ పర్యటనలో ఉండగా, అమెరికా పర్యటన సంబంధించిన అనుమతి ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరడం సరైంది కాదన్నారు. కేంద్రానికి ఆర్టికల్ 73 ప్రకారం కొన్ని పరిమితులుటాయని, ఎన్ఓసి వచ్చిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి అమెరికా వెళ్ళాల్సి ఉండేదని పేర్కొన్నారు. లండన్ పర్యటనకు ముందే అనుమతి దరఖాస్తు చేసుకోవాలని, రాష్ట్రంలో సీఎం పర్యటనలు ముం దుగానే ఖరారవుతాయని పేర్కొన్నారు. విదేశీ పర్యటనలకు సంబంధించి ముందుగా అనుమతి తీసుకోవాలనే విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెలి యదా అని ప్రశ్నించారు. కేంద్రం అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వక పోవడంపై తెలంగాణ కు అవమానమని, ప్రధాని మోడీ కుట్రని రేవంత్ రెడ్డి ఆరోపించడం సరైంది కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన వివరాలను, ఎవరెవరిని కలిశారనే వివరాలను తెలంగాణ ప్రజల ముందు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతీ విషయాన్ని రాజ కీయం చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని తెలిపారు.

# అత్యుత్తమ టెక్ లీడర్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** విద్యార్థులను అత్యుత్తమ టెక్ లీడర్లుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని శ్రీనిధి యూనివర్శిటీ లక్ష్యమని కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి అన్నారు. ది ఆగస్టు ఫెస్ట్ 2026కు టైటిల్ స్పాన్సర్‌గా శ్రీనిధి యూనివర్శిటీ వ్యహరించినట్లు తెలిపారు. పోచారం డివిజన్ యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో ది ఆగస్టు ఫెస్ట్ 2026 నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు సృజనాత్మకత, సాంకేతికతను పెంపొందించేందుకు శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం కృషి చేస్తుందని అన్నారు. సాంకేతిక నైపుణ్యంతో పాటు సృజనాత్మక ఆలోచన కలిసినప్పుడే ప్రపంచస్థాయిలో ప్రభావం చూపే ఆవిష్కరణలు సాధ్యమౌతాయని అన్నారు. ఈ ఫెస్టివల్‌లో పరిశ్రమలకు చెందిన ప్రముఖులు పాల్గొని కమ్యూనిటీ బిల్డింగ్, వ్యక్తిత్వం, ఆధునికత విధానాలు వంటి అంచాలపై చర్చించారు. సంస్కతి, ఆహారం, పానీయాలు, సాహిత్యం, సినిమా, క్రియేటర్ ఏకానమీ వంటి విభిన్న రంగాలను అనుసంధానం చేస్తూ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీనిధి యూనివర్శిటీ తరపున ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డైరక్టర్ మైత్రేయ చక్రవర్తుల ప్యానెల్ విద్యార్థులు పలు అంశాలపై చర్చించారు. ది లాంచ్‌ప్యాడ్ కార్యక్రమంలో పుస్తకాలు, టెక్ ఆర్ట్, సినిమా తదితర సృజనాత్మక రంగాలకు చెందిన 15 కొత్త లాంచ్‌లను పరిచయం చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన ఆదరించే స్టార్టప్‌ల సృజనాత్మకత ఆలోచనాలను విద్యార్థులు ఆవిష్కరించాలని అన్నారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా ది కాన్ఫరెయిన్ కాన్ఫరెన్స్ పేరుతో వీక్షకులను భాగస్వాములను చేసే నాటక ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో ఘనంగా వనమహోత్సవం

- భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటాలి

**శంషాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త :** భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.మంగళవారం శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఆర్బీనగర్‌లో వనమహోత్సవం కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వయంగా పలుమొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పర్యావరణ సమతుల్యతను కాపాడటం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు హరితహారం, వన మహోత్సవం లాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు ఆర్బీ నగర్ కాలనీ వాసులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



స్థానిక నేతలతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి : ఎంపిడిఒ రాధారాణి



**యాచారం ఆగస్టు25, ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు పర్యావరణ సమతుల్యతను కాపాడే లక్ష్యంతో వనమహోత్సవం - సామూహిక మొక్కల నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యాచారం ఎంపిడిఒ రాధారాణి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా యాచారం మండలంలోని 24 గ్రామాల్లో మొత్తం 4,715 మొక్కలను వివిధ ప్రాంతాల్లో నాటరు. అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్, బండ్ ప్లాంటేషన్ మరియు హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద మొక్కలను నాటారు.గ్రామ రహదారుల వెంట, చెరువు కట్టలపై, ప్రభుత్వ, కమ్యూనిటీ స్థలాల్లో, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో, వెంచర్లలో ఇతర అనువైన ప్రదేశాల్లో మొక్కలు నాటారు.యాచారం మండలం లోని 24 గ్రామ పంచాయతీలలో కుర్మిద్ద, గడ్డమల్లయ్యగూడ, తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లి, నందివనపర్తి, నజ్దిక్ సింగారం, చౌదర్‌పల్లి, మంతంగౌరెల్లి, మంతంగౌడ్, నల్లవెల్లి, మొండిగౌరెల్లి, యాచారం, మేడిపల్లి, తాటిపర్తి, నానక్‌నగర్, ధర్మన్నగూడ, తులేకుర్దు, తక్కళ్లపల్లి తండా, గుంగల్, అయ్యవారిగూడ, మాల్, మాల్కీజ్‌గూడ, చింతపట్ల, కొత్తపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సిబ్బంది, గ్రామీణ ప్రజలు తదితరులు కలిపి మొత్తం 283 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

మొత్తం నాటిన మొక్కలు 4,715పాల్గొన్న వారి సంఖ్య, 283 కవర్ చేసిన గ్రామాలు 24 నాటిన ప్రతి మొక్కను సంరక్షి ంచి, వాటి మనుగడకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచిం చారు. పచ్చదనం పెంపు ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటి వాటిని సంరక్షి ంచడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించవచ్చని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలియజేశారు. గుంగల్ గ్రామంలో నిర్వహించిన వనమహోత్సవంలో ఎంపిడివో, సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం

**తలకొండపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

సమాజంలో పర్యావరణం కాపాడేందుకు మొక్కలు ఆధారమని సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, తలకొండపల్లి ఎంపీడీవో సీతా రాధమ్మ, అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల కేంద్రంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో ఉపకరిస్తాయని, గ్రామంలోని ప్రతి ఒక్కరు తమ ఇంటి, పొలాలలో మొక్కలు నాటుకోవాలని ఆయన అన్నారు. మొక్కలు లేకపోవడం వల్ల పర్యావరణం కలుషితంతో పాటు వర్షా బావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, జీవరాశి మనుగడకు మొక్కలు ఎంతో ఉపయోగకరము అని ప్రతి ఒక్కరు తప్పకుండా మొక్కలు పెంచి పరిరక్షించుకోవాలని



ఆయన తెలిపారు. అనంతరం కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఎంపీడీవో సీత రాధమ్మ, మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య అమరేందర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరిబాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపిడిఓ పుష్పలత

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 25,(ప్రభాతవార్త):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపిడిఓ పుష్పలత అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో వనమహోత్సహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగ మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగ చేపడుతున్న వనమహో త్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సూచించారు. గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను బతికించాలని ఆమె తెలి పారు. మొక్కలు నాటడం తో పాటు వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జగదీశ్వర్, ఎంఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి,ఎంపిఓ హన్మంత్‌రెడ్డి, చంద్రశేఖర్, జహంగీర్ శేఖర్ లక్ష్మారెడ్డి జబ్బార్, యాదయ్య, కృష్ణ, పంచాయతీ కార్యదర్శిప్రసన్న కుమార్,టెక్నికల్ అసిస్టెంట్ వినోద్, లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డు రవి,ఉపాధ్యాయులు స్వర్ణలత, పాల్గొన్నారు.

# కాలుష్య నివారణ అవసరం

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 25,(ప్రభాతవార్త):** గ్రామాలలో కాలుష్యాన్ని నయంత్రించడం ఎంతో అవసరమని జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గాలిగూడ ప్రాథమి కోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్ అన్నారు. మంగళవారం పాఠ శాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పాఠశాలలో నాటిన ప్రతి మొక్కను బతికించేందుకు కృషి చేసు_న్నట్లు పెర్కోన్నారు. గతంలో నాటిన మొక్కలకు నీరు అందించి బతికిస్తు న్నట్లు ఆయన పెర్కోన్నారు. ప్రస్తుతం సంవత్సరం నాటుతున్న మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించే విధంగ చూస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు ఆయన పెర్కోన్నారు . ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఆరాధన, ఉపాధ్యాయులు రాజు, జ్యోతి , శిరీష, క్రాంతిమై, ఉప సర్పంచ్ బలరామ్, సత్యం, శేఖర్, లక్ష్మమ్మ, తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు

# జీనోమ్‌వ్యాలీలో వనమహోత్సవం

**శామీర్‌పేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మురహరిపల్లి వార్డు పరిధిలోని జీనోమ్‌వ్యాలీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి ప్రారంభించి మొక్కలు నాటారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మురహరిపల్లి వారు ప్రాంతంలోని జీనోమ్‌వ్యాలీలో వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణంలో పచ్చదనం పెంపొందించటానికి మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని సూచించారు. నాటిన మొక్కలను బాద్యతగ వ్యవరించి సంరక్షించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని వాటిని సంరక్షించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో మొక్కలు పంపిణీ చేయటం జరిగిందని వాటిని నాటి సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు కౌన్సిలర్లు ఎండి యూసుఫ్‌బాబ, ఎస్.జశ్వంత్‌రెడ్డి, గాదె వెంకటేశ, గూదె వెంకటేశ, కైర గణేశ్, దీపిక, మరి కొందరు కౌన్సిలర్లు, నాయకులు కంటం కృష్ణారెడ్డి, ఫారెస్ట్ అధికారులు, సంబంధిత మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







మురహరిపల్లిలో వనమహోత్సవంను ప్రారంభించి మొక్కలు నాటిన మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ యూసుప్‌బాబ, పలువురు కౌన్సిలర్లు తదితరుల దృశ్యం

# స్కూల్ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

**మేడ్చల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** స్కూల్ బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని సైదోనిగడ్డతండాకు చెందిన నూనావత్ సాయి (23) మంగళవారం మద్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై మేడ్చల్‌కు వెళుతున్నాడు. అతనిని మేడ్చల్ సమీపంలోని లోటస్ ఎన్‌క్లేవ్ ముందు 44వ జాతీయ రహదారిపై రాంగ్ రూట్లో ఎదురుగా వచ్చిన జీవికె ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కాగా మేడ్చల్ పట్టణంలోని మెడినోవా ఆసుపత్రికి తరలించగా చికిత్స కొనసాగుతోంది. కాగా బస్సులో 12 మంది విద్యార్థులు ఉండగా ఎవరికి ఏమి కాలేదు. స్కూల్ బస్సులు కూడ ఇలా రాంగ్ రూట్లో వస్తే పిల్లలకు రక్షణ ఎలా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





రాంగ్ రూట్లో వచ్చి ప్రమాదానికి కారణమైన జీవికె ఇంటర్నెషనల్ స్కూల్ బస్సు

# ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసేవరకు నిరంతర పోరాటం

.. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టిఎంయు కృషి

..టిఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్దామరెడ్డి

..ఆర్టీసి హకీంపేట్ డిపో ప్రాంగణంలో జరిగిన ఉద్యోగుల సమావేశం



హకీంపేట్ ఆర్టీసి డిపోలో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న టిఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్దామరెడ్డి, పాల్గొన్న టిఎంయు రాష్ట్ర అధ్యక్షులు శంకర్, హకీంపేట్ ఆర్టీసి డిపో గౌరవాధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి,పలువురు నాయకుల,ఉద్యోగుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

కార్మికుల సమస్యల పరిష్కారమే టిఎంయూ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు,ఆర్టీసిని పూర్తి స్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసే వరకు నిరంతర పోరాటం చేస్తామని టిఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్దామరెడ్డి స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమం కోసం తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయూ) కృషి చేస్తుందని ఆయన అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని హకీంపేట్ ఆర్టీసి డిపోలో ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్దామ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి ఉద్యోగుల సంక్షేమం కొరకు టిఎంయు అనేక పోరాటాలు చేసిందని, హక్కులను సాధించిన ఘనత టిఎంయూకు దక్కుతుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసి ఉద్యోగులను మోసం చేసిన ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్‌కు రానున్న గుర్తింపు ఎన్నికల్లో తగిన బుద్ది చెప్పాలని చిత్తుగా ఓడించాలని అశ్వద్దామరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం పోరాడుతున్న టిఎంయూకు అత్యధిక మెజార్టీతో మద్దతు ఇచ్చి గెలిపించాలని ఆయన కోరారు. భవిషత్‌లో ఉద్యోగుల సమస్యలను యాజ మాన్యం దృష్టికి తీసుకవెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. పలు యూనియన్లకు చెందిన ఉద్యోగులు టిఎంయూలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎంయు రాష్ట్ర అధ్యక్షులు శంకర్, సికింద్రాబాద్ రీజనల్ అధ్యక్షులు పవన్‌కుమార్, కార్యదర్శి శివకుమార్, హకీంపేట్ డిపో గౌరవాధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, నాయకులు తులసిరామ్, శ్రీశైలం, శ్రీనివాస్, వెంకటేశ్, కృష్ణ, మాలిక్, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ధారూర్‌లో ఘనంగా మిలాద్‌ఉన్‌నబీ ర్యాలీ

.. దారుసలామ్ జల్సాకు తరలివెళ్లిన మైనారిటీ సోదరులు

**ధారూర్, ఆగస్టు 25, ప్రభాత వార్త:** ధారూర్ మండల కేంద్రంలో మిలాద్‌ఉన్‌నబీ వేడుకలను మైనారిటీ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షులు మొయిజ్ ఖురేషి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల మైనారిటీ సోదరులతో కలిసి మంగళవారం భారీ ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా మొయిజ్ ఖురేషి మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ధారూర్ నుండి పెద్ద ఎత్తున మైనారిటీ సోదరులు దారుసలామ్‌లో జరిగే జల్సాకు బయలుదేరి వెళ్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో రహీమ్ ఖురేషి, ఉల్ఫాత్ అలీ, జమీర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**పరిగి టౌన్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులకు కందులు, పెసర్ల విత్తనాలను పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతుల సంక్షేమం,వ్యవసాయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.రైతులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి ప్రాణవాయువును పెంచుకోవాలి



వనమహోత్సవంలో పాల్గొన్న జడ్పీ సిఇఒ సుధీర్,మున్సిపల్ చైర్మేన్ తదితరులు

**కొడంగల్,అగష్టు 25,ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలని జడ్పీ సీఈఓ సుధీర్,మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అటవీశాఖ అద్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా పురపాలికలోని సమీకృత వసతి గృహ ప్రాంగణంలో జడ్పీ సీఈఓ సుధీర్,మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,అటవశాఖ ఎఫ్‌ఆర్‌ఓ విజయ్‌కుమార్‌లు కలిసి మొక్కలను నాటారు.మొక్కలు నాటి ప్రాణవాయువును పెంచుకొవాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం 99వేల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకొన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు యాదగిరి,రమేష్,ఫారుక్ అలీ,ఎఫ్‌బీఓ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అంగడిరైచూర్ గ్రామపంచాయతీలో వనమహోత్సవం :**

కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ గ్రామపంచాయతీ ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సౌభాగ్యలక్ష్మీ,ఏపీఓ రాములు ,పంచాయతీకార్యదర్శి కృష్ణవేణి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచంచారు.ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతుబాధ్యతగా కృషిచేయాలన్నారు.నాటిన మొక్కలను సంరంక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.కార్యక్రమంలో గ్రామస్థులు గోపాల్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం.. నందిగామకు మణిహారం

**నందిగామ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షి ంచాలని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, పంచాయతీరాజ్ కార్యదర్శి వై వి రాజు లు పిలుపునిచ్చారు. మంగళవారం నందిగామ మండల కేంద్రంలోని బైపాస్ జాతీయ రహదారిని నుండి నంది గామకు వచ్చే దారిలో జె ఎస్ ఆర్ వెంచర్ కు అనుకొని రహదారి పొడవున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి మమత సూరి, చించేటి లత శివకుమార్,శివగళ్ల ప్రవీణ్, శివగళ్ల సురేష్, బొమ్మగల నర్సింలు, నాయ కులు కేశవాణి రామచంద్రి, నరేందర్ రెడ్డి, శివగల సత్తిపండు, ఎర్రగారి రమేష్, సప్పిడి మహేష్, అభిరామ్ రెడ్డి తడకల జంగయ్య



నందిగామలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ తదితరులు.



హైతాబాద్‌లో నాటుతున్న మొక్కలు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

తదితరులు ఉన్నారు.

## వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

**షాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, హైతాబాద్ సర్పంచ్ శాంతమ్మయాదయ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వన మహోత్సవ కార్యక్రమంలో మంగళవారం హైతాబాద్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షంచాలన్నారు. మొక్కల పెంపకం వల్ల భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం, ఆహ్లాదకరమైన జీవన పరిస్థితులు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మహేందర్, ఉపసర్పంచ్ హీర్యానాయక్, వార్డు సభ్యులు సత్తయ్య, బుచ్చమ్మ, మహేష్, పాషా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి

**ఘట్‌కేసర్, ఆగష్టు 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నాయకులు మంగళవారం ఘట్‌కేసర్ విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో ఇంచార్జ్ ఏఈఈ ప్రసన్నాంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. అవుషాపూర్‌లో గత కొన్ని నెలలుగా విద్యుత్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇంబ్బందులు ఎదుర్కొంటున్నారని పలుసార్లు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలియజేసినప్పటికి సమస్యలు తీర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అవుషాపూర్‌లో నెలకొన్న కరెంట్ సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఏఈఈ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ ఘట్‌కేసర్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి,పాల్గొన్నారు.

## కారు ప్రమాదంతో చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

**ఘట్‌కేసర్, ఆగష్టు 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు ఆసుపత్రులో చికిత్స పొందుతుండగా మంగళవారం ఒకరు మృతిచెందారు. కొండాపూర్ విజ్ఞాన్ కళాశాల రోడ్డు వద్ద కారు ఎదురుగా వస్తున్న 2 బైక్‌లను ఢీకొట్టగా ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా పోలీసులు క్షతగాత్రులను గాంధీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మధ్య ప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్ జిల్లాకు చెందిన నాగ్‌పురే రంజిత్ అతని బంధువులు/గ్రామస్తులైన అరుణ్ (26), ఉమేష్ (20), ప్రదీప్ (24), సజన్ (25) బతుకుదెరువు కోసం ఘట్‌కేసర్ కొండాపూర్‌కు వచ్చి విజ్ఞాన్ ఉమెన్స్ కాలేజీలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో అరుణ్, ఉమేష్, ప్రదీప్, సృజన్ నలుగురు కలిసి తమ బైక్ (ఏపీ10బిఏ-9335) పై ఘట్‌కేసర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా విజ్ఞాన్ కళాశాల సమీపంలో ఎదురుగా అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు ఎక్స్‌యువి (టిజి08కెఎఫ్-0652) వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టి వెనుకాలే వస్తున్న హోండా ఆక్టివా (టిజి22-8573)ని కూడా ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న అరుణ్ కుడికాలు విరిగి, శరీర భాగాలకు తీవ్ర రక్తగాయాలు కాగా ఉమేష్, ప్రదీప్, సజన్‌లకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీపై ప్రయాణిస్తున్న కొట్టె అజయ్ (21) తీవ్ర రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో అరుణ్ (26) చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగతా క్షతగాత్రులలో కొందరిని మెరుగైన చికిత్స నిమిత్తం పంజాగుట్టలోని మెడిటెక్ ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదుదారుడు నాగ్‌పురే రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్‌కు చెందిన కారు డ్రైవర్ రౌత్ వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు అరుణ్ మృతదేహానికి గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.

## బోనస్ కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 25,(ప్రభాతవార్త):** రైతులు బోనస్ పొందేందుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఖరీఫ్ సిజన్ 2026సంవత్సరంలో ప్రభుత్వం సూచించిన ఏడు ప్రత్యేక సన్న రకాల వరిని సాగు చేస్తున్న రైతులకు ఎకరానికి రూ.500 చొప్పున బోనస్ అందించనున్నట్లు తెలిపారు. బోనస్ పొందేందుకు రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబర్ 10, 2026 చివరి తేదీ అని పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాలలో బీపీటీ5204 (సాంబ మసూరి), హెచ్ఎంటీ సోనా, ఆర్ఎన్ఆర్15048 (తెలంగాణ), జైశ్రీరామ్, కేఎన్ఎం1638, కేఎన్ఎం 7715, డబ్ల్యూజీఎల్44 (వరంగల్) ఉన్నాయని తెలిపారు. విత్తనాలను డీలర్ వద్ద కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ వద్దనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పొరుగు రైతుల నుంచి, స్వంత విత్తనం, గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు ,పరిశోధనా కేంద్రాల నుంచి విత్తనం పొందిన రైతులు తమ గ్రామానికి చెందిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 10 తర్వాత రిజిస్ట్రేషన్ స్వీకరించబడదని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పెర్కొన్నారు.

### వరి పంట సాగు వివరాలను

## రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి

**కీసర, ఆగస్టు25, ప్రభాతవార్త:**

వరి రైతులు పంట సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మాధవిలత కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బోనస్ పొందేందుకు సూచించిన 7 రకాల వరిసాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. బోనస్‌కు అర్హమైన వరి రకాలు బిపిటి 5204 (సాంబా మసూరి,సోనా మసూరి),డబ్ల్యూజీఎల్ 44 (సిద్ధి,ఎల్లి) కేఎన్ఎం 1638 (కునారం సన్నాలు),హెచ్ఎంటి,జై శ్రీరాం,కేఎన్ఎం 7715,ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా) రైతులు పై 7 రకాలలో ఏదైనా వరి విత్తనాన్ని డీలర్ పాయింట్ ద్వారా కొనుగోలు చేసినట్లయితే డీలర్ పాయింట్ వద్ద పంట సాగు వివరాలను నమోదు చేయించుకోవచ్చన్నారు. అదేవిధంగా రైతు తన సొంత విత్తనాన్ని ఉపయోగించినా లేదా విత్తన తయారీదారునుంచి నేరుగా విత్తనంతీసుకున్నా సంబంధిత వ్యవసాయ అధికారిని సంప్రదించి తాను సాగుచేసిన వరిరకానికి సంబంధించిన సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించాలన్నారు. ఏఈఓ ద్వారా పరిశీలన అనంతరం పంటసాగు వివరాలను నమోదు చేయించుకోవచ్చన్నారు. కాబట్టి రైతులు తమ వద్ద ఉన్న విత్తన మూలం ఏదైనా తాము సాగు చేసిన పంట వివరాలను సకాలంలో నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం సూచించిన 7వరి రకాలలో సాగుచేసిన రైతులు మాత్రమే సంబంధిత నిబంధనల ప్రకారం బోనస్ ప్రయోజనం పొందేందుకు అర్హులని తెలిపారు.

## కేసులు పెట్టడం సరికాదు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 25,(ప్రభాతవార్త):** విద్యార్థులకు సంఘీభావం ప్రకటించినందుకు బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిపై పోలీసులు కేసులు నమోదు చేయడం సరికాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎదిర రాజు అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల షాద్‌నగర్‌లోని లింగారెడ్డిగూడలో చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి విష్ణువర్ధన్ రెడ్డి గారు సంఘీభావం ప్రకటించారు. విద్యార్థుల సమస్యను అర్థం చేసుకుని, వారి భవిష్యత్తుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో విద్యార్థులతో కలిసి ఆందోళనలో పాల్గొని, ప్రభుత్వం వెంటనే జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రశ్నించడం ప్రతి ఒక్కరి హక్కు. పోలీసు కేసులతో ప్రశ్నించే గొంతును అణచివేయలేరని ఆయన అన్నారు.

..ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే జీవో నంబర్ 97ను రద్దు చేయాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఆయన తెలిపారు.

## ప్రజాశ్రేయస్సుకోసం అందరూ కలిసిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 25,(ప్రభాతవార్త):** ప్రజా శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరు కలిసిరావాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆర్య సమాజ్ భవణంలో 47వ శ్రావణ వేద ప్రచార సత్సంగం కార్యక్రమ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరైయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహర్షి దయానంద సరస్వతి ఆశయాలు, స్ఫూర్తితో ఆర్య సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న పెద్దలను ఆయన అభినందించారు. మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణించేలా మహర్షి దయానంద సరస్వతి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, సమాజ శ్రేయస్సు కోసం ఆర్య సమాజం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యజ్ఞాలు, యాగాల ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు సత్ప్రవర్తన, సమాజం పట్ల బాధ్యత పెంపొందుతుందని అన్నారు. గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఐక్యత, సానుకూల ఆలోచనలు పెంపొందుతాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు వేదాలు, యజ్ఞాల ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఆర్య సమాజం ఆధ్వర్యంలో ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న పెద్దలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యజ్ఞ బ్రహ్మలు అరవింద శాస్త్రీ, వసుధ శాస్త్రీ, ఆర్య సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు విఠల్ రావు ఆర్య, చౌదరిగూడ ఆర్య సమాజ్ అధ్యక్షులు మచ్చ సుధాకర్ రావు, నర్సింగ్ రావు, ఈట గణేష్, రాజేష్ పటేల్, మన్నే నారాయణ యాదవ్, శ్రీధర్ రెడ్డి, సయ్యద్ హఫీజ్, ఎదిర రామకృష్ణ, బాబురావు, సత్య ప్రమోద్ పంతులు, జిల్లేడు వెంకటేష్, కొండి యాదయ్య, మోతీలాల్ నాయక్, అంకం శేఖర్, మంగలి శేఖర్, రామచంద్రయ్య, నారాయణ గౌడ్, నీరున్న, భూపాల్ రెడ్డి, నరేష్ గౌడ్, మానయ్య, దానగల్ల రాములు, శివరాజ్, దామోదర్ రెడ్డి, రవి నాయక్, రామ్ చరణ్, శివ తదిరులు పాల్గొన్నారు.

## పండుగలో ఎలాంటి గొడవలు జరగకుండా చూసుకోవాలి



మాట్లాడుతున్న సిఐ జానకి రామ్ రెడ్డి

**తలకొండపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మండలంలోని అన్ని గ్రామాల్లో పండుగలు వేడుకల సమయంలో ఏ లాంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలు లేకుండా చూసుకోవాలని తలకొండపల్లి సిఐ జానకి రామ్ రెడ్డి అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ వేడుకల ను శాంతియుతంగా సామరశ్య పూర్వకంగా నిర్వహించుకోవాలని, ఎలాంటి అవంచనియా సంఘటనలు చోటు ఇవ్వరాదని ఆయన అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ మతసామరస్యం ప్రజల భద్రత తదితర విషయాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలపై వారికి అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించి వివరించారు. వేడుకలు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా శాతంత్రంగా నిర్వాహకులు నిర్వహించాలని, అదేవిధంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచన చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ జానకి రామ్ రెడ్డి ఎస్ఐ శేఖర్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలి


సాయికృప కాలనీలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులు

**కీసర, ఆగస్టు25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ సాయికృప ఎన్‌క్లేవ్ కాలనీ సమీపంలో రత్నదీప్ సూపర్ మార్కెట్ వద్ద ప్రధాన రహదారి పనులు అసంపూర్తిగా ఉండటంతో రోడ్డుపై గుంతలు,కంకర,రాళ్లు ఏర్పడి వాహన దారులు,బాటసారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నేపద్యంలో ప్రజలు ఆందోళనకు గురవు తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయించి,గుంతలను పూడ్చి రోడ్డును ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని కోరుతున్నారు. ఎలాంటి ఆలస్యం చేయకుండా తక్షణమే పనులను ప్రారంభించాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రంగులు మార్చే పుష్పం..ప్రకృతి అద్భుతం..


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**..మంబాపూర్ చెరువుగట్టుపై కనువిందు చేస్తున్న అరుదైన పుష్పం**

పెద్దేముల్, ఆగస్టు 25, ప్రభాతవార్త: ఇప్పటి వరకు రంగులు మార్చే ఊసరవెల్లిని చూశాం. కాలానుగుణంగా మాటలు, నిర్ణయాలు మార్చే రాజకీయ నాయకులకు చూశాం. కాని ఆకారంతో పాటు రంగులు మార్చే పుష్పాన్ని ఎప్పుడైన చూశారా ! ప్రకృతిలోని అద్భుతానికి నిదర్శనంగా నిలిచే గ్లోరియోసా సూపర్బా పుష్పం.

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలోని చెరువుగట్టుపై కనువిందు చేస్తోంది. పుష్పం వికసించే ముందు బెండకాయ ఆకారంలో లేత ఆకుపచ్చ రంగులో కనిపిస్తుంది. అనంతరం క్రమంగా వికసిస్తు లేత పసుపు -ఆకుపచ్చ రంగులోకి మారుతోంది. పూర్తిగా వికసించే సమయంలో పసుపు, ఎరుపు రంగుల మేళవింపులో ఆకట్టుకొని చివరకు ఎరుపు వర్ణంలో అద్భుతంగా కనిపిస్తుంది. అనంతరం రేకులు పైకి తిరిగి ప్రత్యేక ఆకారాన్ని సంతరించుకుంటాయి. ఈ అరుదైన పుష్పం తీగ జాతికి చెందింది.

దీని శాస్త్రీయ నామం గ్లోరియోసా సూపర్బ పుష్పం వికసించిన తరువాత సుమారు 15 రోజల వ్యవధిలో వాడిపోయి నేలరాలడం దీని ప్రత్యేకత. సోషల్ వర్కర్ కేవిఎం వెంకట్ వృక్ష సంపదపై అవగాహన కల్పించేందుకు మంబాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చూపించి, దాని ఆకారం, రంగుల మార్పు, జీవచక్రం తదితర అంశాలను వివరించారు.

సోషల్ వర్కర్ వెంకట్, పాఠశాల హెచ్ఎం వీరప్ప, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, రాధిక, బాలమణి, ఐదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కేవలం తరగతి గదిలోనే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రకృతిని పరిశీలిస్తు నేర్చుకున్న పాఠాలు విద్యార్థులు జీవితాంతం మర్చిపోలేరని హెచ్ఎం వీరప్ప, సోషల్ వర్కర్ వెంకట్ తెలిపారు.

ప్రకృతిలోని ఆరుదైన వృక్ష సంపదను గుర్తించి, సంరక్షించాల్సిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ఒకే పుష్పంలో ఎన్నో రంగులు, ఎన్నో ఆకారాలు..కొద్ది రోజుల్లోనే ముగిసే జీవితం. గ్లోరియోసా సూపర్బా ప్రకృతి అందాలకు ఓ అద్భుత నిదర్శనంగా నిలుస్తోంది. మనిషి జీవన చక్రం ఈ పుష్పములో కనిపిస్తుందని పలువురు పేర్కొన్నారు.

## అండర్‌బ్రిడ్జి వద్ద నిలిచిన నీటిని తొలగించి,వాహనాల రాకపోకలకు మార్గం సుగమం

**సదాశివపేట వికారాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేదు: సర్పంచ్**

**మోమిన్‌పేట్, ఆగస్టు 25. ప్రభాతవార్త:** మొరంగపల్లి రైల్వే గేటు మరమ్మతుల కారణంగా ప్రధాన రహదారి అయిన సదాశివపేట – వికారాబాద్ వయా మోమిన్‌పేట్ వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న మల్లారెడ్డి గూడ సర్పంచ్ నిర్మల ఉపేందర్‌రెడ్డి స్వయంగా చిన్న రహదారియైన మోమిన్‌పేట్ గోవిందాపూర్ మల్లారెడ్డి గూడ గ్రామాలగుండా వెళ్ళే మార్గంగుండా రాంనాథ్‌గుడుపల్లి సమీసంలో గల అండర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు రావడంతో వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా డిజిల్ వాటర్ ఇంజెన్ ఏర్పాటు చేసి నీటిని పూర్తిగా బయటకి తరలించారు. ఈ తరుణంలో ప్రతి ప్రయాణికుడు, ప్రతి వాహనం చుట్టైనా సుఖంగా ప్రయాణిస్తున్నామని అన్నారు. వికారాబాద్ వైపు ప్రయాణించే ప్రయాణికులు మల్లారెడ్డిగూడెం, కద్పర్ల గ్రామాల మీదుగా ఉన్న ప్రత్యామ్నాయ చిన్న రహదారులను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ మార్గాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

రాంనాథ్‌గుడుపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన మల్లారెడ్డి గూడ గ్రామ సర్పంచ్ నిర్మల ఉపేందర్ రెడ్డి వెంటనే స్పందించారు. అండర్‌బ్రిడ్జి వద్ద నిలిచిన నీటిని తొలగించి, వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.


డీజిల్ ఇంజన్‌తో అండర్‌బ్రిడ్జి వద్ద నీరు తొలగిస్తున్న సర్పంచ్ నిర్మల పెందర్‌రెడ్డి.

దీంతో సదాశివపేట నుంచి వికారాబాద్ వైపు, అలాగే పరిసర గ్రామాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలిగింది. ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించిన సర్పంచ్ నిర్మల ఉపేందర్ రెడ్డి చేపట్టిన చర్యలను వికారాబాద్ డిపో మేనేజర్ నమ్రుత సర్పంచ్‌ని అభినందించారు.

ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని సర్పంచ్ నిర్మల ఉపేందర్ రెడ్డి తెలిపారు.


నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న దృశ్యం

## పెద్దేముల్ మండల పిఆర్‌టియు అధ్యక్షులుగా యం.విజయలక్ష్మి

పెద్దేముల్, ఆగస్టు 25, ప్రభాతవార్త: పెద్దేముల్ మండల పిఆర్‌టియు అధ్యక్షులుగా యం.విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాండూరు పట్టణంలోనిఆర్యవైశ్య కల్యాణ మంటపంలో మండల పిఆర్‌టియు ఎన్నికలను నిర్వహించారు. మండల నూతన పిఆర్‌టియు అధ్యక్షులుగా యం.విజయలక్ష్మి, ప్రధానకార్యదర్శిగా గోబ్ర్యానాయక్, అసోసియేట్ అధ్యక్షులుగా బి.నర్సిరెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా కే.సంగీత, ఉపాధ్యాక్షులుగా బి,శివకుమార్, సి.సురేష్, మహిళా ఉపాధ్యాక్షులుగా యం.రాధిక, అంబిక, కార్యదర్శులుగా పి.రమేష్, యండి,అల్తాఫ్, మహిళా కార్యదర్శులుగా పి.పుష్పలత, యు.శాంతిలు ఎన్నికయ్యారు.

ఇంతకు ముందు మండల పిఆర్‌టియు అధ్యక్షులుగా పనిచేసిన పోల నవీన్‌కుమార్, ప్రధానకార్యదర్శి వెంకట్‌రెడ్డిలు ఉపాధ్యాయుల పక్షాన సమస్యలపై పోరాటం చేయడంతో పాటు సభ్యత్వ నమోదులో జిల్లాలోనే పెద్దేముల్ మండలంలో అత్యధికంగా చేసినందున వారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ద్యావరి నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రవికుమార్, బందెప్ప తదితరులు పాల్గొన్నారు.

### ఏయూకి చెందిన ఇరువురు ప్రతినిధులకు

## అబ్దుల్ కలాం అవార్డులు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యావేత్తలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్ అవార్డులు లభించినట్లు యూనివర్సిటీ ప్రతినిధులు మంగళవారం నాడొక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మేడన్ ఎక్స్‌పో సెంటర్‌లో ఇటీవల జరిగిన భారత్ ఎడ్యుకేషన్ సమ్మిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్ అవార్డు ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారు అవార్డులను ప్రధానం చేశారు. విద్యా రంగంలో విశిష్టసేవలు అందించినందుకుగాను యూనివర్సిటీ అసోసియేట్ ప్రోఫెసర్ డైరక్టర్ ఎం. శ్రీనివాస్‌రావుకు అవార్డు అందజేసినట్లు తెలిపారు. అదే మాదిరిగా అనురాగ్ యూనివర్సిటీ అసోసియేట్ డైరక్టర్ సోషల్ లెర్నింగ్ డాక్టర్. సి. మల్లేశంకు ఎమర్జింగ్ లీడర్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ అవార్డు లభించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో జీవిత నైపుణ్యాలు, సామాజిక అవగాహన పెంపొందిం చేందుకుగాను చేస్తున్న కృషికి ఈ అవార్డు లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన ఇరువురిని యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్లు తెలిపారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి, ఆగస్టు25, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని గడ్డమీది తండా గ్రామపంచాయతీకి చెందిన మిషన్ భగీరథ వాటర్ మాన్ తిరుపతి నాయక్ ఈనెల 23న ప్రమాదవశాత్తు గుర్రై మృతి చెందాడు. మంగళవారం నాడు మృతుని కుటుంబ సభ్యులను గట్టుపల్ పల్లి మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, గడ్డమీది తండ మాజీ సర్పంచ్ ఈశ్వర్ నాయక్, వెంకటరావుపేట్ మాజీ సర్పంచ్ హైమావతి రమేష్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి గుంతలో పడి తిరుపతి నాయక్ చెందడం బాధాకరమని చిన్న వయసులో ప్రమాదవశాత్తు గుర్రై మృతి చెందడం కుటుంబానికి తీరంలోని ఈ సందర్భంగా వారు అన్నారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జయమ్మ వెంకటయ్య ఈశ్వర్ నాయక్, హైమావతి రమేష్, తాండవాసులు కృష్ణ నాయక్, డాక్య నాయక్ భీమ్లాల్ నాయక్ డాక్టర్ లక్ష్మయ్య శీను తదితరులున్నారు.

### విద్యార్థుల పక్షాన నిలిచినందుకే ..

## అక్రమ కేసులా ?

**కొత్తూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చేలా ఉన్న జీవో 97ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసి, విద్యార్థుల భవితకు స్పష్టమైన భరోసా కల్పించాలని బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షుడు అత్తాపురం మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం గళమెత్తుతూ న్యాయపోరాటం చేస్తున్న బీజేపీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిపై కేసులు నమోదు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడినందుకు కక్షసాధింపు చర్యల్లో భాగంగా కేసులు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిపై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవాలని మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. జీవో 97పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే వరకు బీజేపీ విద్యార్థుల పక్షాన నిలిచి పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేష్, హాజిపల్లి గ్రామ ఉపసర్పంచ్ గంగాధర్, కృష్ణ యాదవ్, హనుమంత్, మహేష్, శివ, విక్రమ్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## రుద్రారం మాజీ సర్పంచ్ గొల్లగూడెం లక్ష్మమ్మ మృతి

**షాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** షాబాద్ మండలం రుద్రారం గ్రామ మాజీ సర్పంచ్, ప్రస్తుత గ్రామ సర్పంచ్ గొల్లగూడెం యాదిరెడ్డి తల్లి గొల్లగూడెం లక్ష్మమ్మ (68) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతితో రుద్రారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారుడు యాదిరెడ్డిని పరామర్శించి ఓదార్చారు. ఆమె అంత్యక్రియల్లో పాల్గొని తుది వీడుకోలు పలికా రు. గ్రామానికి లక్ష్మమ్మ అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు. మంచికి మారుపేరుగా నిలిచిన ఆమె గ్రామ ప్రజలతో ఆప్యాయంగా ఉంటూ, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆమె ఆకస్మిక మృతి గ్రామస్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**షాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోసెని సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మాచన్ పల్లి గ్రామానికి శివకుమార్ (22) అదే గ్రామానికి చెందిన సురేష్ ఇద్దరు ద్విచక్ర వాహనంపై మాచన్ పల్లి నుండి హైతాబాద్ కు వెళ్లుతున్నారు. మార్గ మధ్యంలో వెల్స్పన్ కంపెనీ సమాపంలో అటుగా వస్తున్న ద్విచక్రవాహనం వీరి బైక్ ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శివకుమార్ తలకు తీవ్ర గాయం అయ్యింది. సురేష్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. శివకుమార్ ను చికిత్స మిమిత్తం షాద్ నగర్ తరలించగా, మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నారు.


ఫోటో కెఎస్ఆర్: 2: సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న పోలీస్ కమీషనర్ సుమతి

## ఒక్క సిసి కెమెరా వందమంది పోలీసులతో సమానం

**కీసర, ఆగస్టు25, ప్రభాతవార్త:** ఒక్క సిసి కెమెరా వందమంది పోలీసులతో సమానమని మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ సుమతి అన్నారు. చీర్యాల ఆరాధ్య కన్వెన్షన్ హాల్‌లో 9 కాలనీలను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన 150 కెమెరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షిత భవిష్యత్తుకోసం సామాజిక భాగస్వామ్యంలో భాగంగా సంవత్సరకాలంలో ఒక లక్ష సిసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా "నేను సైతం 2.0" కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నేరాల నివారణ, వాహనాల గుర్తింపు, నిఘా ప్రజల భద్రతను బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. సీసీ కెమెరాలు ప్రజల ప్రశాంత జీవనానికి భరోసా ఇస్తాయన్నారు. స్మార్ట్ నిఘా వ్యవస్థను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే విధానంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి చక్రపాణి, సీఐ ఆంజనేయులు, ఎస్ఐలు నాగరాజు, శ్రీనివాస్, అనిల్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపిడిఒ


ఫారం ఫండ్ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

**మర్పల్లి ,ఆగష్టు25, ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలో చేపడుతున్న ఫారం ఫండ్ పనులను మంగళవారం నాడు ఎంపిడిఒ శాంతమ్మ పరిశీలించారు. రావులపల్లి తిమ్మాపూర్, కొత్లాపూర్, బిల్‌కల్ గ్రామాలలో చేపడుతున్న ఉపాధీ పనులను తనిఖీ చేశారు. మండలంకు 87 ఫారం పండ్ గుంతలు మంజూర్ జరిగాయని 16 గ్రామపంచాయతీలలో 23 ఫారం పౌండ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఫారం పండ్ పనులతో వర్షం నీరు వృధాకాకుండా భూగర్భ జలాలు పెంపొందుతాయని ఆమె తెలిపారు. దీంతో సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. పనులు కొలత ప్రకారం చేపడితే పూర్తిస్థాయిలో కూలి డబ్బులు వస్తాయన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది కూలీలకు అందుబాటులో ఉండి పనులు వేగవంతంగా జరిగే విధంగా చూడాలన్నారు. అనంతరం కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓఅంజీరెడ్డి, టీఏ సత్యనారాయణ, ఎఫ్ఏ లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## కరుణించిన గంగమ్మ తల్లి..!


బోరు బావికి మోటార్ బిగిస్తున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ తదితరులు

**నందిగామ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టం చేశారు. నందిగామ ఐదు ,ఏడవ వార్డుల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారి సహకారంతో తవ్వించిన బోరుబావులకు మంగళవారం బోరు మోటర్లు బిగించారు. రెండు బోర్లలో పుష్కలంగా నీరు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ తాను తలపెట్టిన పనుల్లో చేదోడు వాదోడుగా ముందుండి నడిపిస్తున్న వార్డు సభ్యులకు , కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నందిగామ గ్రామ పంచాయతీని కని విని ఎరుగని రీతిలో అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి పనులకు రూపకల్పన చేయడానికి నిధులు ఇచ్చి ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్ , అగ్గి మమత సూరి, శివగళ్ల ప్రవీణ్, చించేటి లత శివకుమార్, శివగళ్ళ సురేష్, బొమ్మ గళ్ళ నర్సింలు,నాయకులు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచంద్రి , నరేందర్ రెడ్డి, శివగళ్ళ సత్తిపండు, ఎర్రగారి రమేష్ తదితరులు ఉన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**షాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఏఎస్ఐ శివరాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సీతారాంపూర్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్ట్ తప్పని సరిగా పెట్టుకోవాలన్నారు. వాహనాలకు సంబందించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించివాహనాలు నడపడం, అతివేగం, ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబందనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు.


సీతారాంపూర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ శివరాణి

## పాలమాకులలో రోడ్డు భద్రతపై అవగాహన

**శంషాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ పోలీసులు పాలమాకుల గ్రామంలోని పీ1 రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ్, ఐపీఎస్ సూచనల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ శంకరయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహన దారులకు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, సీట్‌బెల్ట్ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ర్యాష్ డ్రైవింగ్, అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ద్విచక్ర వాహనదారులకు 35 హెల్మెట్లను పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, తమ భద్రతతో పాటు ఇతర రోడ్డు వినియోగదారుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

